# స్పృహ



**మనకు కావాల్సింది ఏమిటో తెలియాలంటే, ముందుగా మనకు అది లేదన్న స్పృహ కలగాలి. మరి పంజరం లాంటి జీవితంతో సరిపుచ్చుకుంటున్న చాలామందికి తమకు లేనిదేమిటో తెలుసా అన్నది ప్రశ్న**

వినుకొండ. బస్టాండ్‌లో ఆగిన బస్‌లో నుంచి చూస్తున్న విశాలికి హఠాత్తుగా గుర్తుకువచ్చింది. 'లీల ఉండేది ఈ ఊళ్ళోనే అని సౌమ్య చెప్పింది కదూ' అని.

శ్రీశైలం - విజయవాడ దారి లోనే ఈ వినుకొండ ఉందని విశాలికి తెలియదు. విజయవాడ నుంచి వెళ్ళేటప్పుడు రాత్రిపూట అవడం వల్ల విశాలి గమనించ లేదు.

గబగబా బస్ దిగి క్యాంటీన్ దగ్గర టీ తాగుతున్న కండక్టర్‌ని అడిగి బస్ అయిదు నిమిషాలు ఆగుతుందని నిర్ధారించుకుంది.

"ఈ ఊళ్ళో కోళ్ళఫారం ఉందా?" పక్కనే ఉన్న టెలిఫోన్ బూత్‌లో వాకబు చేసింది.

"రెండు ఉన్నాయండి. ఎవరి ఫారం గురించి మీరడిగేది?"

"తెలీదు. నా స్నేహితురాలి భర్తకు కోళ్ళఫారం ఉన్నట్టు తెలుసు."

"ఆయన హరిగారేనా?"

లీల భర్త పేరు హరి అని శుభలేఖలో చూసినట్టు లీలగా గుర్తుంది. పెళ్ళికి విశాలి వెళ్ళలేకపోయింది.

"అనుకుంటాను. ఫోన్ ఉంటే నంబర్ చెప్పండి."

ఫోన్ లీలే ఎత్తింది.

"విశాలీ! ఎక్కణ్ణుంచే? ఏమిటీ వినుకొండ నుంచే! ముందు ఇంటికొచ్చెయ్. హరిగారి ఫారం అంటే ఏ రిక్షా అబ్బాయైనా తీసుకువచ్చేస్తాడు" అంది లీల.

అక్కణ్ణుంచే విజయవాడకు ఫోన్ చేసింది విశాలి.

"అంతా నీ ఇష్టమేనా?"

"అవును. రెండు రోజుల్లో వస్తాను. కొంపలేం మునగవు."

"హుం. నువ్వెప్పుడూ ఇంతే. మీ నాన్నగారు మళ్ళీ ఫోన్ చేస్తారు. నీ స్నేహితురాలి ఫోన్ నంబర్ ఇవ్వు."

"నాన్న ఫోన్ చేశారా?"

"ఆహాఁ. శ్రీశైలం నుంచి అటు హైదరాబాద్ వెళుతూ. నువ్వు ఉదయం బయలుదేరావనీ, మధ్యాహ్నానికి విజయవాడ చేరతావనీ చెప్పారు. నువ్వు క్షేమంగా చేరావో, లేదోనని మళ్ళీ ఫోన్ చేస్తారు."

"నాన్న ఎప్పుడూ ఇంతే. అతి జాగ్రత్త."

"నువ్వు అబలవు కాదు, సబలవని తెలిసీ..."

"చాలు. ఫోన్ పెట్టెయ్యండి."

* * *

"విజయవాడ వెళుతూ ఊరి పేరు చూసి దారిలో దిగిపోయావా?" విశాలి స్నానం, టిఫిన్ అయ్యాక అడిగింది లీల ఆశ్చర్యపోతూ.

"ఏం, నువ్వయితే నా కోసం అలా రావా?"

"చాల్లే. మా ఆయన నా ప్రాణం తీసెయ్యరూ. మా చెల్లెలి పెళ్ళికి రెండు రోజులు ఉండనిచ్చారు. అదే గొప్ప."

విశాలి ఎందుకో అదేమని అడగలేదు.

లీల అత్తగారు విశాలితో బాగానే మాట్లాడింది. కానీ, పనిలో లీలకు సాయం చేసే మనిషిలా కనిపించలేదు.

లీల వంట చేస్తుండగా విశాలి సాయం చేస్తూ - ఇద్దరూ కబుర్లు చెప్పుకున్నారు.

"నువ్వేం మారలేదే. నువ్వూ, నీ స్త్రీవాదం మాటలూ" అంది లీల.

"బాగుందే. లోకాన్ని మార్చుదామని నా ప్రయత్నం అయితే, నేను మారలేదంటావేమిటి" అంది విశాలి.

"అన్నట్టు నీ వాదనలూ, ఆవేశం మావారి దగ్గర చూపించకు. ఆయనకు అలాంటివి నచ్చవు" అంది లీల.

"ఎదురైన వాళ్ళందరితోనూ విభేదించడమేనా నా పని ఏమిటి? సందర్భం వచ్చినప్పుడు నా అభిప్రాయాల్ని వెల్లడిస్తుంటాను. తప్పేముంది?"

"తప్పు కాదులే. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. ఎందుకొచ్చిన వాదనలు చెప్పు."

తమ మధ్య వాదన మొదలయిందనీ, అది లీలకు కూడా రుచించకపోవచ్చువనీ విశాలికి అర్థమై మాట్లాడలేదు.

ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి అంటే ఎవరి ఆలోచనలూ, అభిప్రాయాలూ వాళ్ళకు సరైనవని తోస్తాయనీ, ఎదుటివారి ఆలోచన తప్పయినా ఖండించక మనకెందుకు అని ఊరుకోవాలనీ అర్థం.

"మీ వారు ఎక్కడా కనిపించడం లేదు."

"బయటకు వెళ్ళారు. మధ్యాహ్నం వస్తారు. ఫారంలో పనుంది. నువ్వూ చూద్దువుగాని రా" అంది లీల.

ఇల్లూ, ఫారం ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. చాలా విశాలమైన ప్రాంగణం. అయిదు షెడ్స్, ఒక గోడౌన్. ఒక పక్కగా పనివాళ్ళ క్వార్టర్స్ ఉన్నాయి. ఆ ప్రాంగణమంతా కోళ్ళు చేసే శబ్దాలతో కొత్తగా అనిపించింది విశాలికి.

లీలను చూస్తూనే క్వార్టర్స్‌లో నుంచి ఇద్దరు పనివాళ్ళు బయటకు వచ్చారు.

ఒక షెడ్ తాళం తీసింది లీల. షెడ్‌లో ఉన్న క్రేట్స్ తీసుకొని గుడ్లు ఏరడం మొదలు పెట్టారు.

కేజెస్ (పంజరాలు) ఒకదానిపై మరొకటి మూడు వరుసలు ఉండి షెడ్ అంతా ఎమ్ ఆకారంలో పరుచుకొని ఉన్నాయి.

ఒక్కో బాక్స్‌లో మూడు కోళ్ళు చొప్పున ఆ షెడ్‌లో అయిదువేల అయిదువందల కోళ్ళు ఉన్నాయని చెప్పింది లీల.

రెండు షెడ్‌లలో కలిపి పదివేల కోళ్ళు.

ఒక్కో వరుసకి వాటర్ చానల్, ఫీడ్ చానల్, గుడ్లు జారడానికి వీలుగా రోల్ ఒకదాని కింద ఒకటి ఉన్నాయి.

కోళ్ళ ఫారంలో కేజ్ (పంజరం) సిస్టమ్ విశాలి ఇంతకుముందు చూడలేదు.

"కోళ్ళ ఫారం అంటే కోళ్ళన్నీ నేలమీద షెడ్‌లో ఉంటాయనుకున్నాను" అంది.

"నువ్వు చెప్పేదాన్ని డీప్ లిట్టర్ సిస్టమ్ అంటారు. ఇది కేజ్ సిస్టమ్. ప్రస్తుతం డీప్ లిట్టర్ సిస్టమ్ ఎవరూ అనుసరించడం లేదు. ఆ సిస్టమ్‌లో మూడు షెడ్‌లలో కోడి పిల్లలున్నాయి. చూద్దువుగాని" అంది లీల.

మిగిలిన మూడు షెడ్‌లలో కోడి పిల్లలను గంపల్లాంటి పెద్ద పెద్ద బుట్టలలో పెట్టారు. వాటికి కావలసిన ఉష్ణోగ్రత ఇవ్వడానికి వాటికి కొంచెం పైగా ఎలక్ట్రిక్ బల్బులు వేలాడుతున్నాయి.

కోడి పిల్లల్ని గ్రోయర్స్ అంటారనీ, మూడు షెడ్‌లలో కలిపి మూడు వేల నాలుగు వందల గ్రోయర్స్ ఉన్నాయని చెప్పింది లీల.

"హేచరీస్ నుంచి ఒక రోజు వయసు పిల్లల్ని తీసుకువచ్చి ఇక్కడ పెడతాము. పన్నెండు వారాల వయసు రాగానే కేజెస్‌లో వేయొచ్చు. పెద్దవి కాకపోతే కేజ్ నుంచి బయటకు వచ్చేస్తాయి. గుడ్లు పెట్టే సామర్థ్యాన్ని బట్టి రెండు సంవత్సరాల వయసు వరకూ కేజెస్‌లో ఉండొచ్చు. సామాన్యంగా పదాహారు పదిహేడు నెలలకు కల్ చేస్తారు."

"అంటే?"

చిత్రాలు: నర్సిం



"అంటే, భోంచేస్తారు" అని నవ్వింది లీల.

పనివాళ్ళు గుడ్లు ఏరడం, మేత వెయ్యడం పూర్తి చేసి బయటకు వచ్చాక షెడ్స్‌కి తాళాలు వేసింది.

"ఈ పనివాళ్ళతో ఒక ఇబ్బంది. ఎవరూ సంవత్సరం మించి ఉండరు. మారిపోతూ ఉంటారు."

"అదేం? క్వార్టర్స్ ఇచ్చి, జీతం ఇస్తున్నారుగా. నెలకు ఎన్ని గుడ్లో ఉచితంగా ఇస్తామని కూడా అన్నావు."

"గుడ్లు దొంగతనంగా ఎత్తుకెళితేనే వాళ్ళకు లాభమూ, తృప్తీ. మనం వెనకాలే తిరుగుతుంటే వాళ్ళకు ఇష్టం ఉండదు. కష్టంగా ఉంటుంది. తిరగకపోతే మనకు నష్టం."

ఇంతలో పాలు పోసే అబ్బాయి వచ్చాడు.

"అమ్మా, రెండు వందలు అడ్వాన్స్ ఇస్తారా. రేపటిలోగా పరీక్ష ఫీజ్ కట్టాలి." పాలు పోశాక అడిగాడు.

"రేపు ఉదయం ఇస్తాలే" అంది లీల. బి.ఏ ప్రైవేట్‌గా చదువుతున్నాడని ఆ కుర్రాడు వెళ్ళిపోయాక చెప్పింది లీల.

"రేపే ఆఖరు తేదీ అంటున్నాడు కదే. డబ్బులు ఇచ్చెయ్యకపోయావా?"

"ఆయనకు చెప్పకుండా ఏం చేసినా పెద్ద రాద్ధాంతం చేసేస్తారు. నాకెందుకు తలనొప్పి" అంది లీల.

కోళ్ళ షెడ్‌లు అయిదింటిలో ఠీవిగా నిల్చునున్న రెండు షెడ్‌లు లీల తెచ్చిన కట్నం డబ్బుతోనే వెలిశాయి.

లీల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని భర్త హరించేశాడని అర్థమైంది విశాలికి.

మధ్యాహ్నం భోజనానికి వచ్చాడు లీల భర్త హరి. విశాలిని పరిచయం చేసింది. నవ్వుతూ చేతులు జోడించాడు. పగలంతా లీల ఏదో ఒక పని చేస్తూనే ఉంది. సాయంత్రం కొంచెం తీరికగా మాట్లాడుకున్నారు.

"స్వప్న విడాకులు తీసుకుంది తెలుసా?"

"అయ్యో ఏమైందే?"

"కట్నం చాల్లేదని నానా హింసా పెడుతున్నారట. పోలీస్ కేస్ పెట్టింది. తరువాత విడాకులు తీసుకుంది. 'నాకింక చదువొద్దే. పెళ్ళి చేసుకుని హాయిగా సంసారం చూసుకుంటాను' అందా. దాని కలలన్నీ కల్లలయ్యాయి. ఇప్పుడొక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది."

"విడాకులు తీసుకోకుండా ఎలాగో సర్దుకు పోవాల్సింది" అంది లీల.

విశాలికి ఒళ్ళు మండింది. "భర్త ఎప్పుడు చంపేస్తాడోనని ఎదురు చూస్తూ ఉండాలా?"

"కాదు. నచ్చచెప్పి..."

కోళ్ళ షెడ్‌లు అయిదింటిలో ఠీవిగా నిల్చునున్న రెండు షెడ్‌లు లీల తెచ్చిన కట్నం డబ్బుతోనే వెలిశాయి. లీల ఆర్థిక స్వాతంత్ర్యాన్ని భర్త హరించేశాడని అర్థమైంది విశాలికి.

"నచ్చచెప్పడానికి వాడేమన్నా చిన్న పిల్లాడా, ఇది తప్పు, ఇలా చెయ్యకూడదు అని చెప్పడానికి?"

"జీవితాంతం తోడు లేకుండా ఒంటరిగా బతకొద్దూ."

"అలాంటి తోడు లేకపోవడమే మంచిది. అంతగా తోడు కావాలనుకుంటే మళ్ళీ పెళ్ళి చేసుకుంటుంది."

"మంచివాడు దొరకాలిగా విశాలీ!"

"ఎలాంటి వాళ్ళో చూసుకోకుండా కట్టబెట్టి దాని తల్లితండ్రులు తప్పు చేశారుగా. అది అలాంటి తప్పు చెయ్యదులే" అంది విశాలి.

రాత్రి టీవీలో మంచి సీరియల్ వస్తుంటే చూస్తోంది లీల. విశాలి పుస్తకం చదువుతోంది. హరి బయట నుంచి వస్తూనే హడావిడిగా 'క్రికెట్ మంచి రసపట్టులో ఉంది' అంటూ చానల్ మార్చేశాడు. ఆట ఆఖరి దశలో ఉంది. భారత జట్టు ఓడిపోవడంతోనే, 'చ... సన్నాసులు' అంటూ మరొక చానల్ పెట్టాడు. అలా చానల్స్ మారుస్తూ ఏ ప్రోగ్రాం నచ్చితే అది చూస్తున్నాడు.

"భోజనాలకు రండి" అని లేచింది లీల.

"మీరు టీవీ చూస్తారేమో! మేం గెస్ట్ రూమ్‌లో కబుర్లు చెప్పుకుంటాంలెండి" అంది విశాలి భోజనాలయ్యాక.

"విశాలిగారూ, మీ స్నేహితురాలితో పొద్దుపోయేవరకూ కబుర్లు చెప్పకండి. మళ్ళీ తాను తెల్లవారుజామునే లేవాలి" అన్నాడు హరి నవ్వుతూ.

"రేపు ఒక్క రోజూ తాను ఆలస్యంగా లేస్తుంది లెండి. పనులు మీరు చక్కబెడుదురుగాని" అంది విశాలి తానూ నవ్వుతూ.

హరి ఏమీ అనలేక బలవంతంగా నవ్వాడు. పొద్దుపోయే వరకూ టీవీ చానల్స్‌లో నానా చెత్తా చూసి పడుకున్నాడు.

కోళ్ళు చేసే శబ్దాలతో విశాలికి చాలాసేపు నిద్ర పట్టలేదు. లీల కుటుంబానికి అలవాటైపోయుంటుంది అనుకుంది. హరి గుర్తుకు వచ్చాడు. మనిషి రూపానికీ, మనస్తత్వానికి ఎంతటి అంతరం.

ఆ కేజ్‌లు ఒక్కొక్కటి బహుశా ఒక చదరపు అడుగు వైశాల్యం ఉంటాయేమో. అందులో మూడేసి కోళ్ళు. అవి బతికే - మరో మాటలో చెప్పాలంటే వాటిని బతకనిచ్చే - సంవత్సరన్నర, రెండు సంవత్సరాలు అలా ఇరుకు జీవితం గడపాల్సిందేనా అనుకుంది విశాలి ఆ రాత్రి.

* * *


ఆ మాటే మరుసటి రోజు అడిగింది.


"కేజ్ సిస్టమ్‌లో కొన్ని ఉపయోగాలున్నాయి విశాలీ! డీప్ లిట్టర్‌తో పోలిస్తే పని తక్కువగా ఉంటుంది. మేత వృథా అవదు. స్థలం కూడా కలిసివస్తుంది. డీప్ లిట్టర్ సిస్టమ్‌లో బలవంతుడిదే రాజ్యం. మేత కోసం కొట్టుకోవడం, పొడుచుకోవడం జరుగుతుంది. గుడ్లు మురికిగా కూడా అవుతాయి. కేజ్ సిస్టమ్‌లో మరో ముఖ్యమైన ఉపయోగం కూడా ఉంది. గుడ్లు పెట్టని కోడి ఏదో పరిశీలించడానికి వీలుంటుంది. అప్పుడు దాన్ని కల్ (పిక్ అప్) చేయొచ్చు."

"అయితే, వాటికి స్వేచ్ఛగా తిరిగే అదృష్టం లేదన్నమాట."

"బయట తిరిగే కోళ్ళు నేలను కెలకడం అవీ చేస్తుండడం వల్ల వాటికి కాలిగోళ్ళు పెరగవు. కేజ్ సిస్టమ్‌లో కోళ్ళకు గోళ్ళు బాగా పెరిగిపోయి వాటిని బయట వదిలినా మిగిలిన కోళ్ళలా చలాకీగా తిరగలేవు."

"ఏమోనే! నాకు మాత్రం వాటిని చూస్తే జాలేస్తోంది. అవీ ప్రాణులేగా. మిగిలిన వాటిలా





తమకు స్వేచ్ఛ లేదని బాధ పడుతున్నాయేమో అనిపిస్తుంది."

"సరేలే. వాటికా స్పృహే ఉండదేమో" అంది లీల.

గుడ్లు తీసుకువెళ్ళడానికి వ్యాన్ వచ్చిందా లేదా, ఎన్ని క్రేట్స్ తీసుకువెళ్తున్నారు, కోళ్ళకు మేత ఉందా, తయారైందా - ఇలా ఫారానికి సంబంధించిన అన్ని పనులూ లీలే చూసుకుంటోంది. లీలతో పాటు తిరుగుతూ మాట్లాడుతోంది విశాలి. భోజనం సమయంలో తప్ప హరి ఇంట్లో ఉన్నట్లే కనిపించలేదు.

"ఆయన ఈ మధ్య ఎవరితోనో కలిసి మార్బుల్ వ్యాపారం పెడతానని తిరుగుతున్నారు. ఇందులో డబ్బు తీసుకువెళ్ళి అక్కడ పెడుతున్నారు. దానికోసం కడప వెళ్ళాలి. రాజస్థాన్ వెళ్ళాలి అంటారు. డబ్బూ, సమయం రెండింటికీ ఇబ్బందే. వద్దంటే వినరు. ఆడవాళ్ళకేం తెలుసు అంటారు."

లీల పెళ్ళికి ముందున్నంత చలాకీగా లేకపోవడం గమనించింది విశాలి.

"డాక్టర్‌గారు ఉదయం నడక తప్పనిసరి అని చెప్పారు. నాకు ఎక్కడ కుదురుతుంది" అంది లీల.

ఉదయం ఏడు గంటలకు క్లబ్‌కి బయలుదేరిన హరి చేతిలో విలాసంగా ఊగుతున్న టెన్నిస్ రాకెట్ చెప్పింది లీలకి ఎందుకు కుదరదో!

"నువ్వు చెప్పేది బాగుంది. నేను వాకింగ్‌కి వెళితే ఆయన ఇంటి పని చేస్తారా? ఏడు గంటలకు లేవడమే తరువాయి క్లబ్‌కి వెళ్ళిపోతారు."

"అదే అడుగుతున్నాను. ఇది నీ ఆరోగ్యానికి సంబంధించిన సమస్య. అవసరమైనప్పుడు మగవాళ్ళు ఇంటి పని చేస్తే తప్పేమిటి? పోనీ ఫారం పనైనా చూసుకోవచ్చుగా."

"తప్పేం లేదు. కానీ, ఆయన చెయ్యరు."

"హరితో నేను మాట్లాడనా?"

"అమ్మో! ఆ పని మాత్రం చెయ్యకు. నేను అడిగించాననుకుంటారు."

"పోనీ, నువ్వే అడగరాదూ."

"వద్దులే తల్లీ. ఎందుకు లేని పోని గొడవలు. ప్రశాంతంగా ఉండక."

అవును. మగాడు ప్రశాంతంగా ఉండాలిగా.

"ఇక నేను బయలుదేరతాను లీలా!" మధ్యాహ్నం భోజనాలయ్యాక అంది విశాలి.

"అదేమిటే? అప్పుడే వెళ్ళి పోతావా? ఇంకో రెండు రోజులు ఉండు ప్లీజ్."

"లేదు వెళ్ళాలిలే. అనుకోకుండా వచ్చాగా. నువ్వు విజయవాడ రాకూడదూ. సౌమ్య కూడా ఉంది. ఎలాగూ నర్సాపురం వెళ్ళే దారేగా." అడిగింది విశాలి.

"చూడాలి. ఆయనకు ఖాళీ దొరకాలిగా. నువ్వు సాయంత్రం టీ తాగి బయలుదేరుదువు. విజయవాడ ఎంతసేపులో వెళతావు. మీ వారికి ఫోన్ చెయ్యి" అంది లీల.

'మీ ఆయన స్నేహితుల్ని వెంటేసుకుని, స్నేహితుల్ని కలవాలని ఊళ్ళు తిరుగుతున్నారంటావు. నీకూ నీ స్నేహితురాళ్ళను కలుసుకోవాలనిపించదా' అనడుగుదామనుకుని, వచ్చే సమాధానం తెలిసి అడగలేదు.

స్త్రీ పెళ్ళయ్యాక కోల్పోయే వాటిలో ఇదొకటి అనిపించింది విశాలికి.

విశాలి దృష్టి ఎందుకో అటకమీదకు మళ్ళింది.

"అటక మీద వీణ మీ ఇంటి నుంచి తెచ్చుకున్నదేనా?"

అవునన్నట్లు తలూపింది లీల.

"అటకెక్కించావేం?"

కోళ్ళ ఫారంలో శాశ్వతంగా పనిచేసేదెవరో అర్థమైంది విశాలికి. కేజస్‌లో ఉన్న కోళ్ళకు తమకు స్వాతంత్ర్యం లేదన్న స్పృహ కూడా లేదేమో అన్న లీల మాటలు గుర్తుకు వచ్చాయి. మరి లీలకు?

వీణ చక్కగా పలికిస్తుంది లీల.

"ఆయనకు ఆసక్తి లేదు విశాలీ! సాధన చేద్దామనుకున్నప్పుడల్లా ఏదో ఒక పని (చెప్తారు). అడ్డంగా ఉంటోందని పైన పెట్టేశారు. బంధువులో, స్నేహితులో వస్తే దానికి పని." హరి మీద ఫిర్యాదు చేస్తున్న ధోరణి ఏమీ కనిపించలేదు.

"మరి నాకా భాగ్యం లేదా."

"ఆయన్ని నిద్ర లేవనీ. కిందకు దింపుతారు."

* * *

సాయంత్రం హరి స్నేహితుడు ఒకరు వచ్చారు. లీల టీ చేసి తీసుకువచ్చింది.

"వీడు సంగీతం అంటే చెవికోసుకుంటాడు" అని పరిచయం చేస్తూ "రామ్! మా ఆవిడ వీణ వాయిస్తుంది తెలుసా" అన్నాడు హరి.

"నిజం! అయితే మీకు తప్పదు" అన్నాడు లీలతో.

"మధ్యాహ్నం విశాలి కూడా అడిగిందండీ" అంది లీల.

అటక మీద నుంచి పెట్టె దింపాడు హరి.

రామ్ తన్మయత్వంలో మునిగిపోయాడు. లీల సాధన చెయ్యడం లేదని వీణ పెట్టెమీద పేరుకొని ఉన్న దుమ్ము చెప్పకనే చెప్పింది.

"మీరు మరింత సాధన చేస్తే బాగుంటుంది."

"ఆఁ, ఎందుకూ? కచ్చేరీలు చెయ్యాలా ఏమన్నానా" అన్నాడు హరి.

"ఏరా? కాలేజీ రోజుల్లో మనం టెన్నిస్ హాబీగా కాక టోర్నమెంట్స్ గెలవాలని ఆశ పడలేదూ. మీ ఆవిడ కచ్చేరీ ఇస్తే తప్పేమిటి?"

"చాలురా. నువ్వు నాకు కచ్చేరీ పీకకు" అన్నాడు హరి వాదన పెంచడం ఇష్టంలేక.

"మీ ఇష్టమనుకోండి" అన్నాడు లీలతో.

'దాని ఇష్టమేముంది. ఇంటి చాకిరీయే కచ్చేరీ అయితే' అందామనుకుంది విశాలి. లీల కోరుకుంటున్న హరి ప్రశాంతతను చెడగొట్టడమెందుకని ఊరకుంది.

"స్వరాలు బాగా పలుకుతున్నాయి" అన్నాడు రామ్ తన్మయత్వం వీడక.

విశాలికి మాత్రం అన్నీ విషాదస్వరాలే వినిపించాయి.

* * *

బస్‌లో కూర్చుంది విశాలి.

కోళ్ళ ఫారంలో శాశ్వతంగా పనిచేసేదెవరో అర్థమైంది విశాలికి. కేజస్‌లో ఉన్న కోళ్ళకు తమకు స్వాతంత్ర్యం లేదన్న స్పృహ కూడా లేదేమో అన్న లీల మాటలు గుర్తుకు వచ్చాయి.

మరి లీలకు? ■